సాక్షి
నంద్యాల

సోమవారం । 5 । ఆగస్టు । 2024



కనిపించని ప్రత్యామ్నాయం

వర్షాలు లేక.. పంటలు సాగు చేసుకోలేక రైతులు పొలాలను ఖాళీగా ఉంచారు. అదను దాటుతున్నా ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. 8లో ▸



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.26
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 98.883
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,36,574
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,30,855

రాజకీయ రాక్షసం!

- కూటమి ప్రభుత్వంలో వరుస హత్యలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యం
- టీడీపీ నాయకుల అరాచకం
- ప్రేక్షక పాత్రలో పోలీసులు
- పట్టించుకోని మంత్రులు, ప్రజాప్రతినిధులు
- లోపించిన శాంతిభద్రతలు
- భయాందోళనలో ప్రజలు

కత్తులు కరాళనృత్యం చేస్తున్నాయి...
అధికారికంగానే కుత్తుకలు తెగిపోతున్నాయి..
పోలీసుల సాక్షిగా టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయి..
హత్యలకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నాయి..
గిట్టని వారిని మట్టుబెట్టడమే లక్ష్యంగా సాగుతున్నాయి..
అయినా ప్రభుత్వం మౌనం వహిస్తుంది!
అంతా బాగుందని కితాబు ఇస్తుంది!!
మరో వైపు.. అంతమే పంతమై
అరాచకం రాజ్యమేలుతూ ఉంటుంది..
రాజకీయ రాక్షసి జడలు విప్పి..
రక్తం పారిస్తూ ఉంటుంది..
అయ్యా.. ఇక్కడ ప్రజలకు రక్షణ ఉందా?
రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు భద్రత దొరుకుతుందా?
సామాన్యుడి ప్రశ్నలకు జవాబే ఉండదు!
ప్రజాస్వామ్యానికి పాతరేస్తూ
ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలనే కుట్ర
మరో హత్యకు తెగబడుతుంది!



మహానంది మండలం సీతారామపురంలో హత్యకు గురైన సుబ్బరాయుడు



గ్రామంలో పోలీసుల బందోబస్తు



టీడీపీ నాయకుల దాడిలో ధ్వంసమైన మోటారు సైకిల్

సాక్షి, నంద్యాల: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసుల సాక్షిగా హత్యలకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఎవరిని, ఎప్పుడు, ఎక్కడ చంపుతారోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడపాల్సిన దుస్థితి దాపురించింది. నంద్యాల జిల్లాలో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే జిల్లా హెడ్ క్వార్టర్‌కు కూతవేటు దూరంలో రెండు హత్యలు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు!



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

టీడీపీ అధికార మదానికి పోలీసు శాఖ దాసోహమైంది. ప్రభుత్వ ప్రేరేపిత దాడులు కావడంతో చేష్టలుడిగి చూస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాన్ని కాలరాస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన 52 రోజుల్లోనే వందలాది దౌర్జన్యకాండలు వెలుగు చూశాయి. నిత్యం ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాము హత్యలు చేసినా, దాడి చేసినా, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేసినా పోలీసులు ఏమీ చేయలేరనే ధీమా టీడీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఫరూక్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు.. పార్టీ శ్రేణులను నిలువరించడంలేదు. ఇలాంటి దాడులు సమంజసం కాదని కూడా చెప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి గ్రామాల్లో తమకు ఎదురులేకుండా చేసుకోవాలనే కుట్ర కనిపిస్తోంది.

పథకం ప్రకారమే హత్య

వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినందుకు మా ఇంటిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని మృతుడు సుబ్బరాయుడు కుమారుడు జమాలయ్య తెలిపారు. బయట నిద్రిస్తున్న తల్లి బాలసుబ్బమ్మపై దాడి చేసి గాయపరిచారని, ఇంట్లో నిద్రిస్తున్న తన తండ్రి సుబ్బరాయుడిని ప్రకారమే రాళ్లు, కర్రలతో కొట్టి హతమార్చారన్నారు. పోలీసులు తమకు రక్షణ కల్పిస్తామని హామీ ఇస్తేగాని ఊళ్లో బతకలేమని కన్నీటి పర్యంతమయ్యారు.

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం



సుబ్బరాయుడి హత్యపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. పూర్తి స్థాయిలో విచారించి దోషులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. టీడీపీకి ఓటు వేయలేదన్నదే హత్యకు కారణమని ప్రాథమికంగా తెలిసింది. విచారణలో వాస్తవాలు తెలుస్తాయి.

– నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

చేష్టలుడిగిన పోలీసులు

రాష్ట్రంలో అధికార మార్పు జరిగినప్పటి నుంచి పోలీసుల పనితీరులో స్పష్టమైన మార్పు వచ్చింది. వీరంతా అభద్రతా భావంతో పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నికల ముందు నంద్యాల జిల్లాకు వచ్చిన డీఎస్పీలను జూలై 31న బదిలీ చేశారు. కొత్తవారు ఇంకా బాధ్యతలు కూడా తీసుకోలేదు. అలాగే ఆగస్టు 1వ తేదీ ఐదుగురు సీఐలను కూడా బదిలీ చేశారు. ఇంకా బదిలీలు కొనసాగే అవకాశం ఉండడంతో ఉన్నవారు కూడా విధులపై దృష్టి సారించలేకపోతున్నారు. హత్యలు జరుగుతున్నా చేష్టలుడిగి చూస్తున్నారు.

పోలీసులు చూస్తుండగానే..



పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవి, కాటసాని రామిరెడ్డి, ఎస్వీమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి

మహానంది మండలం సీతారామపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి టీడీపీనేత బుడ్డారెడ్డి శ్రీనివాస రెడ్డి సుమారు 30 మంది అనుచరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో ఒక్కసారిగా మారణకాండ సృష్టించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పనిచేశారనే కక్షతో పసుపులేటి సుబ్బరాయుడు అలియాస్ పెద్దన్న(65)ని అత్యంత పాశవికంగా హతమార్చారు. వదిలేయాలని కాళ్లుపట్టుకుని వేడుకున్న సుబ్బారాయుడు భార్య పసుపులేటి బాలసుబ్బమ్మ పైనా దాడి చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న మృతుని కుమారుడు జమాలయ్య, కోడలు సునీతలను చంపేందుకు ప్రయత్నించడంతో వారు తప్పించుకుని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. పోలీసులు చూస్తుండగానే ఈ దారుణం కొనసాగింది. బాధితులు ఎస్పీకి, పోలీస్ అధికారులకు ఫోన్లు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ప్రజాస్వామ్యం అపహాస్యం

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోంది. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. నిందితులకు ప్రభుత్వమే కొమ్ముకాస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఆడుకోవడానికి వెళ్లిన తొమ్మిదేళ్ల బాలికను జూలై 7న అత్యాచారం చేసి గొంతు నులిమి చంపేసినా.. ప్రభుత్వంలో చలనం లేదు. ఇప్పటి వరకు బాలిక మృతదేహం లభ్యం కాలేదు. ఇంతటి కీలక కేసులో జిల్లా ఎస్పీని మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మైనర్ బాలుడి మేన మామ హుస్సేన్‌ను విచారణ పేరుతో సీసీఎస్ పోలీసులు చిత్రహింసలకు గురిచేసి లాకప్‌డెత్ చేసినట్లు ఆరోపణలు రావడం.. దర్యాప్తు తీరుతెన్నులపై అనుమానాలకు తావిస్తోంది.

మైనర్ బాలిక హత్యాచారం ఘటన మరువక ముందే... ఎస్పీ కార్యాలయానికి కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అయ్యలూరిమెట్ట సమీపంలో రౌడీషీటర్ సాయికుమార్‌ను కొంత మంది దుండగులు పట్టపగలే హత్య చేశారు. సాయికుమార్ తన స్నేహితులతో కలిసి పొలాల్లో కూర్చుని మద్యం సేవిస్తుండగా ఎనిమిది మంది దుండగులు వాహనంలో వచ్చి వేట కొడవళ్లతో అతి కిరాతకంగా నరికి చంపేయడం.. శాంతిభద్రతలు ఏవిధంగా ఉన్నాయో తేటతెల్లం చేస్తోంది.

భయం గుప్పిట్లో సీతారామాపురం

- హత్యతో ఉలిక్కిపడ్డ గ్రామం
- పోలీసు పికెట్

మహానంది: కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న సీతారామపురం గ్రామంలో హత్య జరగడంతో భయాందోళనలు నెలకొన్నాయి. ఏక్షణం ఏం జరుగుతుందో అంటూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీల మధ్య పోటీ నెలకొనడంతో గ్రామంలో విభేదాలు మొదలయ్యాయి. దీంతో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతూ వచ్చారు. లక్ష్యం మేరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బరాయుడును అంతమొందించడంతో అంతటా భయం నెలకొంది.

గ్రామంలో పోలీసుల పికెట్

వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బురాయుడు హత్యకు గురి కావడంతో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. డీఐజీ ప్రవీణ్ కుమార్, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్‌రాణాతో పాటు డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌తో పాటు మరికొంత మంది అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్ల బందోబస్తులో పాల్గొన్నారు. గ్రామంలోకి వచ్చే ప్రధాన మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేసి గ్రామంలోకి వచ్చి వెళ్లేవారిపై పోలీసులు నిఘా ఉంచారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది.



నిర్మానుష్యంగా ఉన్న సీతారామపురం గ్రామం



గ్రామంలో ఆదివారం రాత్రి పోలీసు పికెట్

ఇదేం న్యాయమంటూ పోలీసులతో మొర..

టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తుంటే రక్షణ కల్పించకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు బుడ్డారెడ్డి పెద్దిరెడ్డి, నారపురెడ్డి, శేఖర్ తదితరులు పోలీసులను కలిసి తమ గోడును విన్నవించారు. పెద్దిరెడ్డి తల్లి లక్ష్మీదేవి, సోదరిపై దాడి చేశారని వాపోయారు. దాడిలో లక్ష్మీదేవికి చెందిన ఆరు తులాల గొలుసు పోయిందని ఆమె బోరున విలపించింది.

టీడీపీ దౌర్జన్య కాండ..

- ➤ కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో జూన్ 8న అంపినేని హరికృష్ణ ఇంటికి వెళ్లి టీడీపీ నాయకులు దాడి చేశారు. అడ్డొచ్చిన భార్య తిరుపతమ్మపై కూడా దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.
- ➤ కొలిమిగుండ్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె శీనుపై టీడీపీ నేతలు కట్టెలతో దాడి చేశారు.
- ➤ ఎన్నికల్లో ఏజెంటుగా కూర్చున్నారని జూన్ 14న కొలిమిగుండ్ల మండలం కల్వటాలలో శ్రీకాంత్‌రెడ్డి అనే వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి చేశారు.
- ➤ కొలిమిగుండ్ల మండల పరిధిలోని అబ్దులాపురంలో 21న బోయ లక్ష్మీనాయుడిపై దాడి చేసేందుకు ఇతర గ్రామం నుంచి మూడు వాహనాల్లో రౌడీలను పిలిపించుకుని ఇంటి నుంచి లక్ష్మీనాయుడిని వీధిలో ఈడ్చుకుంటూ వెళ్లి దాడి చేశారు. అడ్డుకోబోయిన శివారెడ్డి, శంకరయ్య, రేణుక,వరలక్ష్మిలపై కూడా దాడి చేశారు.
- ➤ జూన్ 13న ఆత్మకూరులో వైఎస్ఆర్‌సీపీ నాయకులు పువ్వాడ భాస్కర్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు.
- ➤ గడివేముల మండలం ఒండుట్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డిపై టీడీపీ నేతలు జూలై 2న హత్యాయత్నానికి బరితెగించారు. కర్నూలు నుంచి సొంత గ్రామానికి వెళుతున్న ఇతన్ని కత్తులు, గొడ్డళ్లు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ హత్యాయత్నాన్ని అడ్డుకునేందుకు యత్నించిన వెంకటరమణ అనే మరో వ్యక్తిపైనా దాడి చేశారు.

బాధితులకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



సుబ్బరాయుడి అంత్యక్రియల్లో పాల్గొన్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: పసుపులేటి సుబ్బరాయుడు హత్య జరిగిన విషయం తెలుసుకుని వైఎస్సార్‌సీపీ నేతలు సీతారామపురం గ్రామానికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. అర్ధరాత్రి వేళలో శ్రీనివాసరెడ్డి 30 మంది అనుచరులతో మహిళలు, వృద్ధులపై దాడి చేయడం అమానుష చర్య అన్నారు. పోలీసులు, టీడీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రశాంత శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ''చేతకాదని చెప్పండి, మా నాయకులు, కార్యకర్తలను మేమే రక్షించుకుంటాం. చట్టం అందరికీ సమానంగా వర్తింపచేయాలి. టీడీపీ వాళ్లపైనే పోలీసులు ప్రేమ చూపితే రాష్ట్రం ఇలాగే మారిపోతుంది'' అని అన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులకు రక్షణ కరువైందన్నారు. సంపద సృష్టించడమంటే మనుషులను, వైఎస్సార్‌సీపీ నాయకులను చంపడమా అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రశ్నించారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని, పోలీసుల కళ్లెదుటే వైఎస్సార్‌సీపీ నాయకులను వెంటాడి చంపడం బాధాకరమన్నారు. టీడీపీ నేతలు ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ పేదల ప్రాణాలు తీస్తున్నారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆరోపించారు. రాష్ట్రంలో హత్యారాజకీయాలను ఆపాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హితవు పలికారు. సుబ్బరాయుడు మృతదేహానికి లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు నివాళులర్పించారు. అంత్యక్రియల్లో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్కంఠగా జెడ్పీ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

- అధ్యక్షుడిగా రామచంద్రమూర్తి, కార్యదర్శిగా మహమ్మద్ హక్

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు ఆదివారం ఉత్కంఠగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జెడ్పీ అతిథి గృహంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణతో ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 7 గంటలకు ఫలితాల వెల్లడితో ముగిశాయి. మొత్తం ఏడు పోస్టులకు తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా పరిషత్‌లో ఉద్యోగుల కోలాహలం నెలకొంది. జెడ్పీ యూనిట్‌లో మొత్తం 114 మంది ఓటర్లు ఉండగా, 108 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఏడు పోస్టులకు తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో చివరి నిమిషం వరకు ఎవరు విజయం సాధిస్తారనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సాయంత్రం 6 గంటలకు ఓటింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ చేపట్టి ఫలితాలను ఎన్నికల అధికారి, పసుపుల పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కే రామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ హక్, అసోసియేట్ అధ్యక్షుడిగా జీవీ క్రిష్టారెడ్డి, ఉపాధ్యక్షులుగా మధుసూదనయ్య, కోశాధికారిగా తిరుమలేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జీ మాధవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సురేంద్ర యాదవ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. జెడ్పీ యూనిట్‌కు నూతన కార్యవర్గం ఎన్నిక కావడం పట్ల ఏపీ పీఆర్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పీ మురళీమోహన్‌రెడ్డి, ఏఓ బసవశేఖర్, జెడ్పీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పూలమాలలతో అభినందించారు.



జెడ్పీ యూనిట్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గం

తెలుగుగంగ కాల్వకు గండి

రుద్రవరం: అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ నుంచి కొండమాయపల్లె చెరువుకు, అటువైపు ఉన్న ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందించే తెలుగుగంగ కాల్వకు ఆదివారం తెల్లవారు జామున పెద్ద గండి పడింది. దీంతో దిగువకు వెళ్లాల్సిన నీరు ఆ గండి నుంచి వృథా అవుతోంది. అలాగే 18వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో కొందరు రైతులు పేరూరు వద్ద మట్టి సంచులు అడ్డుకట్టగా వేశారు. దీంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి అటువైపు రైతులకు వ్యథగా మారింది. అధికారులు స్పందించి వెంటనే గండిని పూడ్చించాలని, కాల్వల్లో అడ్డుకట్టలను తొలగించి సాగు నీరు దిగువకు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అప్పనపల్లె వద్ద గండి నుంచి వృథాగా పోతున్న నీరు

క్లుప్తంగా

ఎస్సార్బీసీకి చేరిన కృష్ణా జలాలు



కోవెలకుంట్ల సమీపంలో ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: ఇటీవల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదలైన నీరు పట్టణ శివారులో ఉన్న 10వ బ్లాక్ ఎస్సార్బీసీకి పుష్కలంగా చేరింది. అధికారులు కాల్వకు నీటిని విడుదల చేయడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ పరిధిలో ఈ ఏడాది వరి, జొన్న, మిరప, మినుము, తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

కౌలురైతు ఆత్మహత్య



నాగేంద్ర (ఫైల్)

ఆళ్లగడ్డ: దొర్నిపాడు మండలం భాగ్యనగరం గ్రామానికి చెందిన రాగుల నాగేంద్ర (36) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామంలో గత రెండేళ్లుగా నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప, జొన్న పంటలను సాగు చేస్తున్నాడు. ఏటా దిగుబడులు సరిగా రాక సుమారు రూ.14 లక్షలు అప్పులు చేశాడు. ఇక అప్పులు తీర్చలేనని మనస్తాపంతో ఆళ్లగడ్డకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిపోయిన నాగేంద్ర మార్కెట్‌యార్డులోకి వెళ్లి శనగల మాత్ర వేసుకున్నాడు. అనంతరం తాను చనిపోతున్నానని భార్య లక్ష్మీదేవికి ఫోన్ చేశాడు. వెంటనే కుటుంబీకులు అక్కడికి చేరుకోని స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు నాగశేషుడు, యామిని అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నగీనా తెలిపారు.

వివాహిత బలవన్మరణం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో కైరాన్ అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు తెలిపిన వివరాలు.. వండ్రమ్మ, శేఖన్న కుమార్తె కైరాన్‌ను ఐదేళ్ల క్రితం గూళ్యం గ్రామానికి చెందిన హమ్మద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు.. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కైరాన్ భర్త హమ్మద్, అత్త శేఖమ్మ, మామ మయూన్‌బాషాల వేధింపులు తాళలేక శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర విలేకరులకు తెలిపారు.

అడవి జంతువుల మాంసం లభ్యం

అటవీ అధికారుల అదుపులో ఇద్దరు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో అడవి జంతువుల మాంసం ఆదివారం లభ్యమైంది. పక్కా సమాచారంతో రేంజర్ నరసింహులు, బీట్ ఆఫీసర్ రవీంద్రనాథ్ ఠాగూర్ తమ సిబ్బందితో కలిసి మాంసం ఉన్న రెండు ప్రదేశాలలో తనిఖీలు చేశారు. ఒకచోట అడవి పంది మాంసం, ఒక హోటల్‌లో అడవి జంతువు మాంసం స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత రంగారావు, శ్రీను ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అటవీశాఖ అధికారులు విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మాంసం అడవి జంతువులకు చెందినదా, లేదా అనేది ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శివకుమార్, ఆత్మకూరు నుంచి వచ్చిన పశువుల డాక్టర్ల పరీక్షలో తేలనుంది.

కరువు తరుముతున్నా.. కనిపించని ప్రత్యామ్నాయం

- వర్షాభావంతో 2,29,575 హెక్టార్ల భూములు ఖాళీ
- జూన్ 15 నుంచి జిల్లాలో వర్షాలు అంతంత మాత్రమే
- రైతుల పరిస్థితి దయనీయం
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించని వ్యవసాయ శాఖ



కల్లూరు మండలంలో ఇంతవరకు విత్తనం పడని భూములు

కర్నూలు(అగ్రికల్చర్): సరైన వర్షాలు లేక జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు సాగు చేసుకోలేక రైతులు పొలాలను ఖాళీగా ఉంచారు. అదను దాటుతున్నా ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4,19,221 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 1,89,391 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కాగా.. 2,29,830 హెక్టార్ల(5,74,575 ఎకరాలు) భూములు ఖాళీగా ఉన్నాయి. బావులు, బోర్లు, కాల్వల కింద 58 వేల హెక్టార్లలో పంటలు సాగవుతుండగా.. నీటి వసతి కింద సాగుకు అవకాశం ఉన్న భూములను మినహాయించినప్పటికీ 1,71,830 హెక్టార్లలో భూములు ఖాళీగా ఉన్నట్లే. ఖరీఫ్‌లో రెండు నెలలు గడిచి పోగా.. ప్రధాన పంటలైన పత్తి, వేరుశనగ వంటి పంటల సాగుకు అదును దాటిపోయింది. ఈ నేపథ్యంలో ఏ పంటలు వేసుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అయితే వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై ఇంతవరకు దృష్టి సారించిన దాఖలాలు లేవు. వర్షాభావ పరిస్థితులను బట్టి చూస్తే ఖరీఫ్ సాఫీగా గట్టెక్కడం సులువు కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్లక్ష్యపు మత్తులో వ్యవసాయ శాఖ

వర్షాభావ పరిస్థితులు నెలకొని సాగులో పురోగతి లేనప్పటికీ వ్యవసాయ శాఖలో చలనం లేకుండా పోయింది. సాధారణంగా జూలై చివరి నాటికే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధంగా ఉండాలి. ఈ ఏడాది జూన్ రెండో పక్షం నుంచే వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. జూలై నెల మొత్తం అంతంతమాత్రం వర్షాలే కురిశాయి. అయితే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరైన వానలు లేక ఒకవైపు పంటలు దెబ్బతింటున్నా మరోవైపు వ్యవసాయ శాఖ మాత్రం పంటల పరిస్థితి బాగా ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక ఇస్తుండటం రైతులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వ్యవసాయ శాఖ ఉద్దేశ పూర్వకంగా కరువును కప్పేసే ప్రయత్నం చేస్తుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

లోటు వర్షపాతం

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతం నెలకొంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా... 56.7 మి.మీ. నమోదైంది. జూన్ నెలలో 15వ తేదీ వరకు మాత్రమే వర్షాలు కురిశాయి. జూలై 15 తర్వాత చినుకు జాడ లేదు. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మిమీ ఉంది. ఈ నెల మొదటి వారంలో వర్షాలు పడితేనే ఖరీఫ్ గట్టెక్కే అవకాశం ఉంది.

➤ జిల్లాలో పత్తి 45.51 శాతం మాత్రమే సాగైంది. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం ఆగస్టు మొదటి వారం వరకు మాత్రమే నల్లరేగడి నేలల్లో ఈ పంట సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. భూముల్లో తేమ లేకపోవడం, వర్షాలు పడే అవకాశాలు లేకపోవడంతో పత్తి సాగు ప్రశ్నార్థకమే.

➤ వేరుశనగను జూలై చివరి వరకు మాత్రమే సాగు చేసుకోవచ్చు. ఆగస్టులో వేసుకుంటే చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో ఈ పంట 57.57 శాతం మాత్రమే సాగైంది.

ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు వివరాలు హెక్టార్లలో

పంట పేరు	సాధారణ విస్తీర్ణం	సాగైంది
పత్తి	2,43,689	1,10,892
వరి	12,771	561
మొక్కజొన్న	4,652	2,997
కొర్ర	1,684	2,359
కంది	25,557	18,378
వేరుశనగ	58,969	33,949
ఆముదం	9,231	6,010
మిరప	29,998	1,966
ఉల్లి	15,698	5,911
సజ్జ	3,639	3,488
టమాట	2,606	1,247

పత్తి దెబ్బతింటోంది



మేము ఇంతవరకు పత్తి మాత్రమే సాగు చేశాం. వాన లేక అది కూడా దెబ్బతింటోంది. కంది, మొక్కజొన్న, పొగాకు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. తేమ లేకపోవడంతో భూములను ఖాళీగా ఉంచాం. మా గ్రామంలో 50 శాతం వరకు భూముల్లో పంట వేయలేదు. సాగు చేసిన పంటలకు వర్షాలు అత్యవసరం అయ్యాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. సూపర్-6లో ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలు పెట్టుబడిసాయం అందించాలి. 2023 ఖరీఫ్ పంటల బీమా ఇవ్వాల్సి ఉంది. 2023-24 రబీ కరువుకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి ఆదుకోవాలి.

– శేషారెడ్డి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

ఈ నెల 15 తర్వాతే ప్రణాళిక



ఆగస్టు 15 వరకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అవసరం లేదు. నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల సిఫారస్సుల మేరకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధమవుతుంది. మండలాలు, సబ్ డివిజన్ వారీగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఏఏ విత్తనాలు ఎన్ని అవసరమవుతాయనే వివరాలు తీసుకుంటున్నాం. ఈ నెల 15 తర్వాత వివరాలు ప్రభుత్వానికి పంపుతాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

విద్యుదాఘాతంతో రైతు మృతి





కురవ ఖాజా (ఫైల్), మృతదేహం కోసం బావిలో గాలిస్తున్న దృశ్యం

సి.బెళగల్: కొత్తకోట గ్రామంలో విద్యుత్ ఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి సమాచారం మేరకు.. కర్నూలు రూరల్ మండలం సుంకేసుల గ్రామానికి చెందిన కురువ కర్రెన్న కుమారుడు కురువ ఖాజా (40) కొత్తకోట పరిధిలోని పొలాలను కౌలుకు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పొలానికి నీళ్లు అందించే విద్యుత్ మోటర్ కొత్తకోట గ్రామ శివారులోని ఎత్తిపోతల పథకం దగ్గర ఉంది. విద్యుత్ మోటర్ పైపులైను ఫుట్‌బాల్ వాచర్ మరమ్మతులకు గురైంది. దీంతో ఆదివారం ఖాజా మరి కొంతమంది రైతులతో కలిసి వాచర్‌ను సరి చేసేందుకు ఎత్తిపోతల పథకం నీటి బావిలో దిగాడు. అదే సమయంలో పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన మోటారుకు ప్రమాదశాత్తూ విద్యుత్ ప్రసారం కావడంతో ఖాజా విద్యుదాఘాతానికి గురై నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏడీఈ జాసన్, ఏఈ సుకుమార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య పద్మావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బావి దాదాపు 30 మీటర్ల లోతు, బావిలో ఎక్కువగా మోటార్ల పైపులు ఉండటంతో ఖాజా ఆచూకీ గుర్తించడం కష్టంగా మారింది. దీంతో రైతులు, ఈతగాళ్ల సాహాయంతో మోటార్ల పైపులను తొలగించి బావిలో శవాన్ని గుర్తించి తాళ్ల సహాయంతో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విజయవాడ వెళ్లిన జిల్లా కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విజయవాడ వెళ్లారు. ఆయన అక్కడ సోమ, మంగళవారాల్లో సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. అనంతరం తిరిగి బుధవారం కర్నూలులో రానున్నారు. వివిధ శాఖల ప్రగతి నివేదికలను తీసుకొని వెళ్లినట్లు సమాచారం.

వీనుల విందుగా అష్టోత్తర పారాయణం



అష్టోత్తర పారాయణం చేస్తున్న భక్తులు



తుంగభద్ర నదిలో స్వామిజీ దండోదక స్నానం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సామూహిక అష్టోత్తర పారాయణం వీనుల విందు చేసింది. ఆదివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల నేతృత్వంలో అష్టోత్తర పారాయణం చేపట్టారు. సూర్యోదయాన పీఠాధిపతి పవిత్ర తుంగభద్ర నదిలో దండోదక స్నానం చేశారు. మేళతాళాలతో శ్రీమఠానికి చేరుకున్నారు. అనంతరం ఊంజల మండపంలో ప్రత్యేక పూజలు గావించి అష్టోత్తర పారాయణానికి శ్రీకారం చుట్టారు. ఎంతో పవిత్రంగా సాగిన పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఉరుకుంద డిప్యూటీ కమిషనర్‌గా గురుప్రసాద్



కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా పి.గురుప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీసీహెచ్.జి వెంకటేష్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లడంతో జిల్లా ఉన్నతాధికారులు గురుప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరన్న స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం ఉన్నాయని దానికి తగ్గటుగా ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా క్యూలైన్‌ల ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్కింగ్, లడ్డు, పూలిహోర, అన్నదాన అంశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దార్ల నియామకాల్లో జాప్యం


- ఇప్పటి వరకు రెండు విడతల్లో 21 మందికి స్థానాలు కేటాయింపు
- మరో 11 మందికి కేటాయించని వైనం

తహసీల్దార్ పేరు	కేటాయించిన మండలం
పి.జ్యోతి రత్నకుమారి	ఆళ్లగడ్డ
ఎస్.సుభద్ర	దొర్నిపాడు
ఎం.శ్రీనివాసులు	ఉయ్యాలవాడ
ఎస్.రవికుమార్	చాగలమర్రి
వి.చంద్రశేఖర్‌నాయక్	జూపాడుబంగ్లా
జి.ఉమారాణి	కొత్తపల్లి
కె.వి. శ్రీనివాసులు	శ్రీశైలం
కె.శ్రీనివాసగౌడ్	వెలుగోడు
జి.రత్నరాధిక	ఆత్మకూరు

నంద్యాల(అర్బన్): ఎన్నికల విధులకు వెళ్లిన మండల తహసీల్దార్లు నంద్యాల జిల్లాకు వచ్చిన ఐదు రోజులు అయ్యింది. ఇంత వరకు వారికి మండలాలు కేటాయింపు జరగలేదు. విడతల వారీగా ఆదివారం వరకు 21 మంది తహసీల్దార్లకు మండలాల కేటాయింపు జరిగినా మరో 11 మందికి స్థానాలు కేటాయించాల్సి ఉంది. ఏ మండలం కేటాయిస్తారో తెలియక తహసీల్దార్లకు ఉత్కంఠ తప్పడం లేదు. ఈ సారి తహసీల్దార్ల నియామకంలో ఎక్కువ సిఫారస్సు లేఖలు పొందిన వారికే ప్రాధాన్యంలో పోస్టింగ్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. అధికారులు కూడా చేసేది ఏమీ లేక ఒత్తిళ్లకు లోబడి పోస్టింగ్ జాబితాలు తయారు చేయడంలో నిమగ్నమైనట్లు సమాచారం. శనివారం 9 మందికి, ఆదివారం మరో 12 మందికి స్థానాలు కేటాయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నంద్యాల జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికలు పూర్తి కావడంతో వారందరూ ఇటీవల నంద్యాల జిల్లాకు బదిలీపై వచ్చారు. జిల్లాకు వచ్చేసిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టింగ్‌లు పొందిన నూతన తహసీల్దార్లు వెంటనే ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నియామకాలు ఇలా..

డి.రవికుమార్ – కలెక్టరేట్ ఏఓ
డి.సుధాకర్‌రావు – కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్
కె.నరసింహారావు – కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్
హెచ్.హరినాథరావు – ల్యాండ్ మ్యాటర్స్ సెక్షన్



అక్విడెక్ట్‌పై మొలచిన మొక్క



ప్రవహిస్తున్న కేసీ కాలువ



అక్విడెక్ట్‌పై పెరిగిన మొక్కలు

మొలకెత్తిన నిర్లక్ష్యం!

బ్రిటీష్ ప్రభుత్వంలో సరుకు రవాణా కోసం డచ్ కంపెనీ కర్నూలు–కడప కెనాల్(కేసీ కెనాల్)ను 1863–1870లో నిర్మించింది. దీనిని ఈస్టిండియా కంపెనీకి విక్రయించారు. ఆపై ఇది రెండు జిల్లాలకు తాగు, సాగు నీరు అందిస్తోంది. కర్నూలు నగరంలో హంద్రీ నదిపై ఈ కాల్వ ప్రవాహానికి అక్విడెక్ట్ నిర్మించారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న కట్టడాన్ని వారసత్వ సంపదగా కేంద్రం గుర్తిస్తుంది. 'హెరిటేజ్'గా గుర్తిస్తే చారిత్రక ప్రాంతాలను పర్యాటకులు చూసేందుకు వస్తారు. దీంతో వాటిని వారసత్వ సంపదగా భద్రంగా కాపాడుకోవల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అయితే ఈ అక్విడక్ట్‌పై మొక్కలు మొలిచి కట్టడానికి పగుళ్లు వస్తున్నా కేసీ కెనాల్ అధికారుల్లో చలనం లేదు. కనీసం దీన్ని 'హెరిటేజ్ స్ట్రక్చర్'గా గుర్తించారు..కాపాడుకుందాం అనే భావన ఏ ఒక్కరిలో లేదు. అధికారులు, ప్రభుత్వంలో ఈ నిర్లక్ష్యం ఇలాగే ఉంటే వారసత్వ సంపదకు నిర్లక్ష్యపు పగుళ్లు ఏర్పడి త్వరలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా దీన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

శ్రావణం.. శుభప్రదం

- శుభ ముహూర్తాలకు వేళాయె!
- నేటి నుంచి శ్రావణ మాసం
- మోగనున్న కల్యాణ వీణ



మహానంది ఆలయం

మహానంది: హిందూ సంస్కృతీ సంప్రదాయాల్లో శ్రావణ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. అందుకే ఈ మాసాన్ని శుభాలు, పండుగల మాసం అని అంటారు. ఈ నెలలో అన్ని రోజులూ శుభకరమే. ఈ మాసమంతా ప్రతి ఇల్లూ నిత్య పూజలతో అలరారుతుంది. ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోతాయి. ఈ నెల 05 తేదీ (సోమవారం) నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. మహా విష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో వచ్చినందున ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు. మహాలక్ష్మీకి ఎంతో ప్రీతికరమైన మాసం. మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తుంటే మరో వైపు వివాహ, గృహ ప్రవేశాలు, తదితర శుభకార్యాలు చేపట్టనున్నారు. ప్రతి ఇల్లు మామిడి తోరణాలు, గడపకు పసుపు కుంకుమలు, ముత్తైదువులు తాంబూలాలు, వాయనాలు, వేడుకలతో కళకళలాడే నెల ఇది. తోబుట్టువులకు పవిత్రమైన బంధాన్ని తెలుపుతూ చేతికి రక్షణ కట్టే రాఖీ పౌర్ణమి ఈ నెలలోనే రానుంది. సకల విద్యలకు మూలమైన హయగ్రీవ జయంతి సైతం శ్రావణ పౌర్ణమి రోజునే వస్తుంది. శ్రావణ బహుళ అష్టమి రోజున శ్రీకృష్ణాష్టమి పండుగ చేయడం ద్వారా ప్రతి ఇంటికి శ్రీకృష్ణుడు వస్తారని నానుడి. ఇలా అనేక శుభ ముహూర్తాలతో పాటు పర్వదినాలకు నెలవు.

ఇవీ ముహూర్తాలు

ఈ ఆగస్టు నెలలో 10, 11 నుంచి పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. 13, 14తో పాటు 14,15, 17, 18, 21, 22, 23, 24, 27, 28, 29, 30 తేదీల్లో శుభ ఘడియలు ఉన్నాయి. ఈ తేదీల్లో ఇప్పటికే పలు జిల్లాల వారు మహానందిలో వివాహాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు, వసతి గృహాలను బుక్ చేసుకున్నారు. మహానందితో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వివాహాలు చేసుకోనున్నారు. వీటితో పాటు ఈ నెలలో 6వ తేదీన మంగళ గౌరీ వ్రతం, 16న వరలక్ష్మీ వ్రతం, 19న రాఖీ పూర్ణిమ, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాలు సైతం ఉన్నాయి.

ఇక శుభకార్యాలు షురూ

శుభ ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్న వేళ ఇక శ్రావణ మాసం వచ్చేసింది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కల్యాణ మండపాలు, క్షేత్రాల్లో కల్యాణ వీణమోగనుంది. నంద్యాల జిల్లాలోని ప్రముఖ ఆలయాలైన శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం, నందవరం, ఓంకారం, సూర్యనంది, ప్రథమ నంది తదితర ఆలయాల్లో నూతన వధూవరులు వివాహాలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మంచి శుభ ముహూర్తాలున్నాయి. సీమంతాలు, అన్నప్రాసన, వ్యవసాయ సంబంధిత పనులు, వ్యాపార ప్రయాణాలు, క్రయవిక్రయాలు, వివాహ, గృహారంభాలు, గృహప్రవేశాలు, వాస్తుపూజలు నిర్వహించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఫొటోగ్రాఫర్లు, సప్లయర్స్, క్యాటరింగ్, ఫ్లవర్ డెకరేషన్, వంటవాళ్ళు, నాయీబ్రాహ్మణులు, డ్రమ్స్, తప్పెట కళాకారులతో పాటు అన్ని వర్గాల వారికి ఈ శ్రావణ మాసంలో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

శ్రావణ మాస పూజలకు విశేష ఫలితం



శ్రావణ మాసంలో చేసే పూజలకు విశేషమైన ఫలితం ఉంటుంది. మూడు శక్తులైన మహాగౌరీ, మహాలక్ష్మీ, మహాసరస్వతిలను ఆరాధించడానికి, మంగళవారాల్లో మంగళగౌరీ వ్రతాలు, శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు, శ్రావణ పౌర్ణమి రోజున గాయత్రీ పూజ, నూతన యజ్ఞోపవీతాదులు, గాయత్రి జపాలు ఆచరించవలసిన మాసం. శ్రీకృష్ణుడు ఈ మాసంలోనే జన్మించడం విశేషం. శ్రావణ బహుళ అష్టమి రోజున కృష్ణాష్టమి పండుగ చేయడం ద్వారా ప్రతి ఇంటికి శ్రీకృష్ణుడు వస్తాడని నానుడి. ఈ మాసంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రీతికరమైన నాగులచవితి వ్రతం చాలా విశేషం. – బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, వేదపండితులు, మహానంది దేవస్థానం

నేటి నుంచి శ్రీశైలంలో శ్రావణ మాసోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సోమవారం నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శ్రావణమాసోత్సవాలు జరుగనున్నాయి. ప్రతిరోజు వేకువజామున 4.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. శ్రావణ మాసంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు భక్తులకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది. శ్రావణ మాసంలో రద్దీ కారణంగా శ్రావణ శని, ఆది, సోమవారాలు, శ్రావణ పౌర్ణమి (మొత్తం 16 రోజుల పాటు) రోజులలో గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేశారు. అలాగే రద్దీ రోజుల్లో సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు కూడా పూర్తిగా రద్దు చేశారు. శ్రావణ మాసంలో భక్తుల సౌకర్యార్థం శ్రావణ రెండవ శుక్రవారం (ఈ నెల 16న) 1250 మంది భక్తులకు, తెల్లరేషన్‌కార్డు కలిగిన 250 మంది భక్తులకు మొత్తం 1,500 మంది ముత్తైదువులకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపిస్తారు. అలాగే శ్రావణ నాల్గవ శుక్రవారం (ఈ నెల 30న) 500 మంది చెంచు ముత్తైదువులకు, 500 మంది ఇతర భక్తులకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపిస్తారు. భక్తుల సౌకర్యార్థమై పరోక్ష ఆర్జితసేవగా వరలక్ష్మీవ్రతాన్ని చేసుకునే అవకాశాన్ని దేవస్థానం కల్పించింది.